క్లుప్తంగా

వేలం పాటలు

వినుకొండ (నూజెండ్ల): వినుకొండ రూరల్ పరిధిలో మదమంచిపాడు తిరునాళ్ల వచ్చే నెల 10వ తేదీన జరగనున్న నేపథ్యంలో ప్రభుత్వ నిబంధనలు మేరకు కొబ్బరికాయలు, కొబ్బరి చిప్పలకు బహిరంగ వేలంపాట నిర్వహించినట్లు దేవదాయ అధికారి మంజూ ఉష గురువారం తెలిపారు. తిరునాళ్ల వేడుకలు ఒకరోజు మాత్రమే ఈ నిబంధనలు వర్తిస్తాయన్నారు. దేవదాయ చైర్మన్ సుబ్బారెడ్డి, దేవాలయ అధికారులు వెంకటరెడ్డి, అమ్మిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కమిటీ చైర్మన్ సామేపల్లి వీరాంజనేయులు, సర్పంచ్ బి.వీరాంజనేయులు పాల్గొన్నారు.

ఉచిత ఉపాధి శిక్షణ

నరసరావుపేట రూరల్: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, వైఎస్సార్ క్రాంతిపథం, సీడాప్ ఆధ్వర్యంలో 10వ తరగతి నుంచి డిగ్రీ పూర్తిచేసిన నిరుద్యోగ యువతీ, యువకులకు ఉచిత శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు డీఆర్డీఏ ఏపీఎం రామాంజనేయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు 9908482907లో సంప్రదించాలని కోరారు.

పలువురు గైర్హాజరు

నాదెండ్ల: గణపవరం చుండి రంగనాయకులు కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. మొత్తం 334 మంది విద్యార్థులకు గాను 7 మంది గైర్హాజరయ్యారు. ఒక్క నిమిషం నిబంధన పాటించారు. ఉదయం 8.30 గంటలకు పరీక్షా హాలులోకి అనుమతించగా, 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకూ పరీక్ష జరిగింది. చీఫ్ సూపరింటెండెంట్‌గా కె.ఎం. రత్నకుమార్, డిపార్ట్‌మెంట్ అధికారిగా వై రమేష్ వ్యవహరించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణను ప్రిన్సిపల్ ఎం.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ చైతన్య పర్యవేక్షించారు.

అనుమతులు తప్పనిసరి

శావల్యాపురం: మండలంలోని బొందిలిపాలెంలో ఈనెల 22న జరిగే తిరునాళ్ల నేపథ్యంలో పోలీసు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్సై గల్లా రవికృష్ణ కోరారు. గురువారం మండలంలోని బొందిలిపాలెం గ్రామంలో తిరునాళ్లలో జరిగే ఏరియాలో విద్యుత్ ప్రభలు నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేసే స్థలాలు ముందుగానే తెలపాలన్నారు. విద్యుత్ ప్రభలు 9 ఏర్పాటు చేస్తున్నారని తప్పనిసరిగా పోలీసులు అనుమతులు పొందాలన్నారు.

రైతులకు అండగా ఉంటాం

వినుకొండ(నూజెండ్ల): రైతులకు, కౌలు రైతులకు ఏపీ రైతు సంఘం అండగా నిలుస్తుందని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, సీపీఐ రాష్ట్ర సహాయకార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావులు అన్నారు.పట్టణంలోని వెల్లటూరు రోడ్డులోని జీవీసీ ఫంక్షన్ హాలులో ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రథమ మహాసభ గురువారం జరిగింది. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ జమలయ్య, జిల్లా అధ్యక్షులు తాళ్లూరి బాబురావు, జిల్లా ప్రధాన కార్యదర్శి యు.రాము, ఎస్కే హుస్సేన్, బూదాల శ్రీనివాసరావు, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

18న కళాశాల వార్షికోత్సవం

నరసరావుపేట రూరల్: ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాల 15వ వార్షికోత్సవాన్ని ఈనెల 18వ తేదీన నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.నాగమల్లేశ్వరరావు తెలిపారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాల విద్యార్థులు గురువారం పట్టణంలో ఫ్లాష్‌మాబ్ నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఆట, పాటలతో సందడి చేశారు.కళాశాల కార్యదర్శి షేక్‌కరీం మొహిద్దీన్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులు సాంకేతిక విద్య ను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు 15 సంవత్సరాలనాడుకళాశాలను స్థాపించినట్టు తెలిపారు.

నేడు అవగాహన కార్యక్రమం

యడ్లపాడు: కార్మికులు ఎదుర్కొంటున్న వివిధ రకాల సమస్యల పరిష్కారాన్ని చూపేందుకు అవగాహన సదస్సును ఏర్పాటు చేసినట్లు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి మిక్కిలి సురేష్‌బాబు తెలిపారు. బోయపాలెం గ్రామంలో రంగనాయక స్పిన్నింగ్ మిల్లు పక్కనే ఉన్న క్వారీ వర్కర్ల క్యాంపు ప్రాంగణంలో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభం అవుతుందన్నారు.

కేజీబీవీలో తనిఖీ

బొల్లాపల్లి: గ్రామోదయంలో భాగంగా మండల ప్రత్యేక అధికారి ఎస్.ఓబులనాయుడు మండల కేంద్రం బొల్లాపల్లిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం గురువారం రాత్రి సందర్శించారు. విద్యార్థినులతో కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. కేజీబీవీలో విద్యా బోధన, జగనన్న గోరుముద్ద పథకం తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు.

డస్ట్ బిన్నులు, ట్రాక్టర్లు ప్రారంభం



స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆదేశాల మేరకు మున్సిపల్ కార్యాలయంలో పట్టణ పారిశుద్ధ్యం కోసం నూతనంగా పెద్ద డస్ట్‌బిన్నులను, ట్రాక్టర్లను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ తడిచెత్త, పొడిచెత్తను వేరే చేసేందుకు పెద్ద డస్ట్ బిన్నులను, రవాణా కోసం ట్రాక్టర్లను ప్రారంభించినట్లు వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు షకీలా, పాపసాని బ్రహ్మయ్య, రామిరెడ్డి, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

–వినుకొండ(నూజెండ్ల)

భీమేశ్వరునకు అద్దాల మండపం



పాతూరులో వేంచేసి ఉన్న గంగాపార్వతీ సమేత భీమలింగేశ్వర స్వామి వారి ఆలయంలో నూతనంగా నిర్మించిన అద్దాల మండపాన్ని గరువారం శృంగేరి పీఠాధిపతి భారతీ తీర్థ స్వామి అనుచరులు, ఆస్థాన పండితులు కృష్ణమూర్తి, తంగిరాల సీతారామశాస్త్రి, తంగిరాల శివకుమార్‌లు ప్రారంభించారు. దాదాపు రూ.5 లక్షల వ్యయంతో ఈ మండపాన్ని నిర్మించారు. స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు ఉంజల్ సేవ, ఇతర పూజా కార్యక్రమాలను నిర్వహించుకునేందుకు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మఠం మేనేజర్ కె.వి.కె. నాగరాజు పాల్గొన్నారు.

– నరసరావుపేట ఈస్ట్

పౌష్టికాహారం తప్పనిసరి



విద్యార్థినులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనత సమస్యను అధిగమించాలని పసుమర్రు మద్ది కామయ్య జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం షేక్ మొహమ్మద్ యాసీన్ చెప్పారు. సచివాలయ హెల్త్ సెక్రటరీ షేక్ రిజ్వానా, ఏఎన్ఎంల ఆధ్వర్యంలో పాఠశాలకు చెందిన 70 మంది విద్యార్థినిలకు గురువారం రక్త పరీక్షలు నిర్వహించారు బాలికలు ఆకుకూరలు, బెల్లం, చిక్కీలు, కోడిగుడ్లు వంటి ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం తోట పద్మావతి, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

– చిలకలూరిపేట

శభాష్.. మంచి పనిచేశారు



మండలంలోని కృష్ణాపురం గ్రామంలో గుంటూరు–కర్నూలు జాతీయ రహదారి మార్గంలో రోడ్డు ప్రమాదాలు నియంత్రణకు పోలీసులు సారథ్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టటం అభినందనీయమని నరసరావుపేట డీఎస్పీ సి.విజయ్ భాస్కరర్ రావు అన్నారు. పోట్లూరు గ్రామంలో ఎస్సీ,ఎస్టీ కేసు విచారణ అనంతరం తిరిగి ప్రయాణంలో జాతీయ రహదారి మార్గంలో ఏర్పాటు చేసిన డ్రమ్ములను డీఎస్పీ స్వయంగా పరిశీలించారు. ఎస్సై గల్లా రవికృష్ణ ను ప్రత్యేకంగా అభినందించారు.

–శావల్యాపురం

ఇర్లపాడులో పర్యటించిన కలెక్టర్

- కేంద్రియ విద్యాలయ భూమి పరిశీలన
- వివరాలతో హాజరుకావాలంటూ అధికారులకు ఆదేశం



భూములు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్

నాదెండ్ల: ఇర్లపాడు కేంద్రియ విద్యాలయానికి కేటాయించిన భూమిని పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ గురువారం సందర్శించారు. సర్వే నెంబరు 431లోని సబ్ డివిజన్‌లో య.16.64సెంట్లు భూమి ఉండగా, ఇందులో య.10.11 సెంట్ల భూమిని గతంలో పంచాయతీ తీర్మానం చేసి కేంద్రీయ విద్యాలయ నిర్మాణానికి స్థానిక రెవెన్యూ అధికారులు అంగీకార పత్రాలు ఇచ్చారు. దీనిలో సుమారు య.1.90 సెంట్లు భూమిపై ఓ రైతు కోర్టును ఆశ్రయించగా ఇటీవల కోర్టు కేంద్రియ విద్యాలయానికి అనుకూలంగా తీర్పునిచ్చింది. అయితే ఈ భూమిని ఆనుకుని ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి 300 ప్లాట్లతో ప్రైవేటు లేఔట్ వేశాడు. ఈ లేఔట్‌లోకి వెళ్లాలంటే కేంద్రియ విద్యాలయానికి కేటాయించిన భూమి మీదుగానే వెళ్లాల్సి ఉంది. రియల్‌ఎస్టేట్ వ్యాపారి తమ ప్లాట్లకు దారి కావాలంటూ కలెక్టర్‌కు అర్జీ అందించాడు. అదీ గాక విద్యుత్ స్తంభాలు ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కోరాడు. కేంద్రీయ విద్యాలయ చైర్మన్ హోదాలో కలెక్టర్ శివశంకర్ భూములను పరిశీలించి స్థానిక అధికారులతో మాట్లాడారు. వచ్చే సోమవారం నాటికి అన్ని వివరాలతో కలెక్టరేట్‌కు హాజరు కావాలని ఆదేశించారు. ఆయనతో పాటూ తహసీల్దార్ ఏవీ రమణ, ఎంపీడీవో జాకీర్ హుస్సేన్, మండల సర్వేయర్ అబ్బూరి శ్రీనివాసరావు, డీటీ అనురాధ, కేంద్రియ విద్యాలయం ప్రిన్సిపల్ విజయ కుమార్, మండల విద్యుత్‌శాఖ ఏఈ ప్రసాద్, కాంట్రాక్టర్, స్థానిక వీఆర్వోలు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు పటిష్ట చర్యలు

రక్షిత మంచి చెరువులు నింపేందుకు సమాయత్తం



గణపవరంలోని తాగునీటి చెరువు

నాదెండ్ల: వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు అధికారులు చర్యలు చేపట్టారు. మండలంలోని అన్ని రక్షిత మంచినీటి చెరువులు నింపేందుకు సమాయత్తమయ్యారు. మేజర్ పంచాయతీ గణపవరం రక్షిత మంచినీటి చెరువును గత మూడు రోజులుగా సాగర్ జలాలతో నింపుతున్నారు. మరో మూడు రోజుల్లో రెండు చెరువులు పూర్తిస్థాయిలో నిండనున్నాయి.

ఏడాదికి మూడు పర్యాయాలు చెరువులకు నీరు నింపుతుండటంతో తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు ప్రయత్నిస్తున్నారు. మేజర్ పంచాయతీ గణపవరం చిలకలూరిపేట మున్సిపాలిటీలో విలీనమై మూడు ఏళ్లైనా, కోర్టులో కేసు ఉండటంతో పంచాయతీ నిధులతోనే చెరువుల నిర్వహణ చేస్తున్నారు. మండలంలోని కనపర్రు చెరువు 95 శాతం, అప్పాపురం 85 శాతం, నాదెండ్ల-1 60 శాతం, నాదెండ్ల-2 50 శాతం, నాదెండ్ల -3 90 శాతం, చందవరం 90 శాతం, గొరిజవోలు 80, సంకురాత్రిపాడు 90 శాతం, జంగాలపల్లె 40 శాతం, చిరుమామిళ్ల 50 శాతం మేర సాగర్ జలాలతో నింపారు. మరో వారం రోజుల్లో చెరువులను పూర్తిస్థాయిలో సాగర్ జలాలతో నింపనున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సూర్యతేజ తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ కేసుపై డీఎస్పీ విచారణ



పోట్లూరులో విచారణ చేస్తున్న డీఎస్పీ విజయ్‌భాస్కరరావు

శావల్యాపురం: మండలంలోని పోట్లూరుగ్రామంలో కులం పేరుతో దూషించి కొట్టిన ఘటనపై ఎస్సీ, ఎస్టీ కేసు పోలీసులు నమోదు చేసిన నేపథ్యంలో నరసరావుపేట డీఎస్పీ సి.విజయ్‌భాస్కరరావు గురువారం విచారణ చేశారు. గ్రామసచివాలయంలో డిజటల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ముట్లూరి మణిరత్నంపై అదే గ్రామానికి చెందిన గాలి వెంకటేశ్వర్లు, గాలి శ్రీనివాసరావు ఇరువురు వ్యక్తులు కులంలో దూషించినట్లు ఫిర్యాదు అందింది. ఈసందర్భంగా డీఎస్పీ సారథ్యంలో విచారణ చేపట్టగా పోట్లూరు గ్రామ సచివాలయంలో ఫిర్యాదు దారుడు ముట్లూరి మణిరత్నం, ఆరోగ్య కార్యకర్త, గ్రామసచివాలయ మహిళా పోలీసులను విచారణ చేసి చెప్పిన అంశాలను పోలీసులు వీడియో తీశారు. అనంతరం డీఎస్పీ విలేకర్లతో మాట్లాడుతూ ఈనెల 8వ తేదీన సాయంత్రం రీసర్వే పనులకు సంబంధించిన ధృవీకరణ పత్రాలు అందజేయగా, ఈపని తాను చేసేది కాదని సమాధానం చెప్పి ధృవీకరణ పత్రాలు పక్కనే ఉన్న బల్లపై పెట్టారన్నారు. ఈక్రమంలో గాలి వెంకటేశ్వర్లు, గాలి శ్రీనివాసరావు కులం పేరుతో దూషించి దుర్భాషలాడి, గొడవపడి కొట్టినట్లు ఫిర్యాదుదారుడు మణిరత్నం విచారణలో చెప్పినట్లు డీఎస్పీ తెలిపారు. డివిజన్ పరిధిలో ఎస్సీ, ఎస్టీ కేసులు 48 కేసులు నమోదు చేశామన్నారు. ప్రభుత్వ ఉద్యోగి విధులకు ఆటంక పరచటంతో పాటు కులం పేరుతో దూషించి కొట్టినందుకు గాను ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఆయనతో పాటు ఎస్సై గల్లా రవికృష్ణ పోలీసు సిబ్బంది ఉన్నారు.

తిరుమల కళాశాలలో ఉద్రిక్తత

- పార్టీ కండువాలతో టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ చదలవాడ హల్‌చల్
- విద్యార్థులతో కలిసి టీడీపీ పాటలకు డాన్స్‌లు
- అడ్డుకున్న మరో వర్గం
- అనుమతి లేకుండా రావడంపై యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు



కళాశాలలో పార్టీ కండువాలతో విద్యార్థినులతో కలిసి డాన్స్ చేస్తున్న డాక్టర్ చదలవాడ

నరసరావుపేట రూరల్: జొన్నలగడ్డలోని తిరుమల ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన సాంకేతిక సమ్మెళనం ఉద్రిక్తతలకు దారితీసింది. ప్రశాంత వాతావరణంలో విద్యార్థుల ఆట పాటలతో ఉత్సాహంగా జరుగుతున్న సమ్మేళనం టీడీపీ నాయకుల రంగప్రవేశంతో ఉద్రిక్తంగా మారింది. విద్యార్థుల సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపర్చుకునేందుకు ఉపయోగించాల్సిన సమ్మేళనాన్ని టీడీపీ నాయకులు రాజకీయ ప్రసంగాలకు వేదికగా మార్చారు. దీంతో విద్యార్థులు రెండు వర్గాలుగా విడిపోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. కళాశాలలో నిర్వహిస్తున్న సాంకేతిక సమ్మేళనానికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ చదలవాడ అరవిందబాబు హాజరయ్యారు. టీడీపీ కండువాలు వేసుకుని డాక్టర్ అరవిందబాబు కళాశాలకు వచ్చారు. వారితో వచ్చిన వారు పచ్చకండువాలను విద్యార్థులకు పంచిపెట్టారు. ఈ క్రమంలో పార్టీ కండువాలు ధరించి విద్యార్థులు టీడీపీ పాటలకు నృత్యాలు చేయడం మొదలు పెట్టారు. దీనికి కొంత మంది విద్యార్థులు అభ్యంతరం చెప్పడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఇరువర్గాలకు సర్దిచెప్పారు. తరువాత కూడా టీడీపీ పాటలు వేస్తూ డాన్స్‌లు కొనసాగించడంతో మరో వర్గం విద్యార్థులు సమ్మేళనాన్ని బాయ్‌కాట్ చేసి బయటకు వెళ్లిపోయారు. రూరల్ ఎస్ఐ బాలనాగిరెడ్డి కళాశాలలోనే ఉండి ఎటువంటి ఘటనలకు తావు లేకుండా చర్యలు తీసుకున్నారు. ఇంత జరుగుతున్నా కళాశాల యాజమాన్యం మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. సాంకేతిక సమ్మేళనానికి రాజకీయ నాయకులను ఆహ్వానించడం ఏమిటని పలువురు తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఒక వర్గాన్ని ప్రోత్సహించే విధంగా కళాశాల యాజమాన్యం చర్యలు ఉన్నాయని వారు మండిపడుతున్నారు.

అనుమతి లేకుండా కళాశాలలోకి ప్రవేశించారు

కళాశాల స్థాపించినప్పటి నుంచి కులాలకు, రాజకీయాలకు అతీతంగా నిర్వహిస్తున్నాం. మా అనుమతి లేకుండా టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ చదలవాడ అరవిందబాబు కళాశాలలోకి ప్రవేశించారు. అడ్డుకున్న సెక్యూరిటీ సిబ్బంది పట్ల దురుసుగా ప్రవర్తించారు. ఐదు వాహనాల్లో వచ్చి విద్యార్థులతో కలిసి టీడీపీ పాటలకు డాన్స్‌లు చేశారు. దీనివలన కళాశాల ప్రతిష్టకు భంగకలిగింది. ఇటువంటి ఘటనల వలన విద్యార్థుల మధ్య గ్రూపులు ఏర్పడి కళాశాల వాతావరణం దెబ్బతింటుంది.

–డాక్టర్ వై.వి.నారాయణ, ప్రిన్సిపల్

దుర్మార్గపు ఆలోచన

కళాశాల యాజమాన్యం వేర్వేరు పార్టీలు ఉన్నా ఎప్పుడూ కళాశాలలోకి రాజకీయపార్టీలను అనుమతించలేదు. కానీ డాక్టర్ అరవిందబాబు దురుద్దేశంతో పార్టీ జెండాలతో కళాశాలలోకి అడుగుపెట్టాడు. విద్యార్థులను రెండు వర్గాలుగా విడగొట్టి ఉద్రిక్తతలు సృష్టించే కుట్ర చేశాడు. అనుమతి లేకుండా గేట్లు నెట్టుకుంటూ వందమంది కళాశాలలోకి ప్రవేశించారు. వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. దీంతో పాటు కళాశాల ప్రతిష్టకు భంగం కలిగించినందుకు పరువునష్టం దావా వేస్తామని స్పష్టం చేశారు.

–బొల్లా బ్రహ్మనాయుడు, కళాశాల చైర్మన్

2025 నాటికి క్షయ నిర్మూలనే లక్ష్యం



ఫుడ్‌బాస్కెట్ పంపిణీ చేస్తున్న ఎంపీపీ

యడ్లపాడు: క్షయ వ్యాధిని 2025 నాటికి నిర్మూలించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ పిడతల ఝాన్సీ చెప్పారు. ప్రధాన మంత్రి నిక్షయమిత్ర కార్యక్రమం యడ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి గోపీ నాయక్ మాట్లాడుతూ గత నెల నుంచి నిక్షయ్ పాత్ర కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా ప్రారంభించారన్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో పీహెచ్‌సీ పరిధిలో ఉన్న క్షయవ్యాధి గ్రస్తులకు ఆయా మండలాల్లోని మండలస్థాయి అధికారులు దత్తత తీసుకుని ప్రతినెలా 14వ తేదీన ఫుడ్‌బాస్కెట్ పేరిటా మంచి పౌష్టికాహారం అందించాలని కలెక్టర్ ఆదేశించారన్నారు. గతనెల నుంచి ఈ కార్యక్రమం మండలంలో అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. అయితే కేవలం ప్రస్తుతం చికిత్స పొందుతున్న రోగులకు మాత్రమే వీటిని అందిస్తున్నట్లు చెప్పారు. గత రెండు నెలలుగా 10 మందికి పంపిణీ చేస్తున్నామని, ఏప్రిల్ నుంచి 22 మందికి ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకారం అందిస్తున్న ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలోపీహెచ్‌సీ వైద్యులు శ్యాంసన్, సీహెచ్‌వో పున్నారావు, జీజీహెచ్ ఈఎన్‌టీ వైద్యులు మౌనిక, పీహెచ్‌సీ సూపర్‌వైజర్, ఏఎన్ఎం, ఆశాలు ఉన్నారు.

మహనీయుడు పొట్టి శ్రీరాములు



గణపవరంలో పొట్టిశ్రీరాములు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు



రొంపిచర్లలో శ్రీరాములు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ప్రధానోపాధ్యాయులు షేక్ మొహిద్దీన్



వినుకొండలో నివాళులర్పిస్తున్న కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు

యడ్లపాడు: స్థానిక శాఖా గ్రంథాలయములో అమరజీవి పొట్టి శ్రీరాములు 122వ జయంతి కార్యక్రమం జరిగింది. పొట్టి శ్రీరాములు గారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎండోమెంట్ మాజీ కమిషనర్ పోపూరి గంగయ్యచౌదరి, పాత్రికేయుడు మానుకొండ రామారావు పాల్గొని ప్రసంగించారు.

వినుకొండలో...

వినుకొండ(నూజెండ్ల): అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను స్థానిక మున్సిపల్ ఆఫీస్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం ఆయన చేసిన త్యాగాన్ని ఈ సందర్భంగా పలువురు కొనియాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్ షేక్ షకీలా, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆదేశాల మేరకు అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

రొంపిచర్లలో....

రొంపిచర్ల: మండలంలో గురువారం అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలలో ఆయన చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

బొల్లాపల్లిలో....

బొల్లాపల్లి: మండలంలోని వెల్లటూరు గ్రామంలో వాసవిక్లబ్ వైభవ్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు గురువారం నిర్వహించారు. గ్రామ ప్రధానసెంటర్‌లో నిర్వహించిన జయంతిలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నాదెండ్లలో....

నాదెండ్ల: భాషాసంయుక్త రాష్ట్రాల సాధనకు తన ప్రాణాన్ని త్యాగం చేసిన అమరజీవి పొట్టిశ్రీరాములు అని ఎంఈవో ఐ.ఆంజనేయులు చెప్పారు. మండల పరిషత్ కార్యాలయం, అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గురువారం పొట్టిశ్రీరాములు జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు 123వ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్, మాజీ ఎంపీపీ చుండూరి వెంకటేశ్వర్లు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూల మాలలు ఘన నివాళి అర్పించారు.

చిలకలూరిపేటలో....

చిలకలూరిపేట: అమరజీవి పొట్టి శ్రీరాములు రాష్ట్రం కోసం చేసిన త్యాగం చిరస్మరణీయమైనదని వైఎస్సార్ సీపీ నాయకులు చెప్పారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో విడదల గోపీనాథ్, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని,తదితరులు పాల్గొన్నారు.

యడ్లపాడులో....

యడ్లపాడు: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ పిడతల ఝాన్సీ పాల్గొని పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ బాష, ఉపాధి పథకం ఏపీవో విజయకుమారి, టీఏ మాధవి, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉష, సిబ్బంది పాల్గొన్నారు.